వేడుకలు విషాదం కావొద్దు

- బాణసంచా పేలుళ్లతో ప్రమాదాలు
- పెళ్లి సంబరాల్లో టపాసులు పేలి గాయాలు
- అంత్యక్రియల్లో బాణసంచా పేలి పలువురికి గాయాలు
- నిర్లక్ష్యంతోనే ఘటనలు


భారీ పేలుడుకు ధ్వంసమైన ఇల్లు (ఫైల్)

పలమనేరు: శుభ, అశుభ కార్యక్రమాలకు ఇప్పుడు టపాకాయలు ఉండాల్సిందే. కానీ వీటిని కాల్చే సమయంలో జరిగే నిర్లక్ష్యం కారణంగా పలమనేరు నియోజకవర్గంలో ఇప్పటికే పలు ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. దీనికి తోడు ఎలాంటి అనుమతులు లేని టపాకాయల తయారీ కేంద్రాలు, అమ్మకాలు ఇక్కడ జోరుగా సాగుతున్నాయి. దీనిపై స్థానిక అగ్నిమాపక అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఇటీవల జరిగిన ఘటనలు...

గంగవరం మండలంలోని మారేడుపల్లి సమీపంలోని పసలమందలో గతేడాది టపాసులు తయారు చేస్తున్న ఓ ఇంట్లో ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఆ ఇంట్లో ఉన్న దంపతులు ఖాదర్ బాషా(47), రిహానా(35), కుమారుడు హమద్(5) తీవ్రంగా గాయపడి చిత్తూరులో చికిత్సపొందుతూ భార్యాభర్యలు మృతిచెందారు. పశువుల కొట్టంలోని ఓ పాడి ఆవు మృతిచెందగా మరో రెండు ఆవులకు దెబ్బలు తగిలాయి. ఇంటి ముందున్న కారు, బైక్‌లు అగ్నికి ఆహుతయ్యాయి. అక్కడి టపాకాయల తయారీ కేంద్రంలో పనిచేసే ఖాదర్ బాషా అదేవిధంగా తన ఇంట్లోనే అక్రమంగా తయారు చేస్తున్నట్టు అప్పట్లో అధికారులు గుర్తించారు. ఆ ఇంట్లో భారీగా నిల్వ ఉంచిన టపాసులు, నల్లమందు కారణంగానే ఈ ప్రమాదం జరిగిందని వారు నిర్ధారించారు.

- గతంలో గడ్డూరు కాలనీలోని ఓ టపాకాయల కేంద్రంలో ప్రమాదం జరిగి పలువురు గాయపడగా ఓ వ్యక్తి మృతిచెందాడు.
- గతేడాది ఓ విజయోత్సవ కార్యక్రమంలో టపాకాయల కారణంగా ప్రమాదం జరిగి పలువురు గాయపడ్డారు.
- ఇక దీపావళి రోజున పెద్దపంజాణి మండలంలో టపాసులు ఓ ఇంటిపై పడి ఆ ఇల్లు అగ్నికి ఆహుతైంది.
- తాజాగా గంగవరం మండలంలోని దండపల్లిలో కుమ్మరి శెట్టిమ్మ అంత్యక్రియల్లో బాణసంచా పేల్చుతుండగా నిల్వ ఉంచిన టపాసుల సంచిపై నిప్పు పడి అవి అంటుకున్నాయి. దీంతో ఉన్నట్టుండి భారీ శబ్దంతో పేలుళ్లు జరిగి అంత్యక్రియలకు హాజరైన పదిమంది గాయపడ్డారు.

నిబంధనలు గాలికి...

సాధారణంగా టపాకాయలను తయారు చేసేందుకు అన్ని రకాల అనుమతులు పొందాలి. ఈ కేంద్రాలను జనావాసాలకు దూరంగా పెట్టుకోవాలి. కానీ అనుమతులు లేకనే టపాకాయలు చేసే వారు ఈ ప్రాంతంలో ఎక్కువగా ఉన్నారు. ఇక టపాకాయల వ్యాపారులు సైతం ఆయా ఏడాదికి రెవెన్యూ, ఫైర్ శాఖల నుంచి అనుమతులు తీసుకొని ఆపై వ్యాపారాలు చేయాలి. కానీ కొందరు అధికార పార్టీ వారమంటూ ఇష్టానుసారంగా టపాకాయల విక్రయాలను చేస్తున్నట్టు సమాచారం. దీనిపై ఇప్పటికైనా సంబంధిత శాఖలు నిఘా ఉంచాల్సిన అవసరం ఎంతైనా ఉంది.


మారేడుపల్లి ప్రమాదంలో గాయపడి మృతిచెందిన ఖాదర్‌బాషా (ఫైల్)


దండపల్లి అంత్యక్రియల్లో గాయపడిన వ్యక్తి(ఫైల్)

క్లుప్తంగా

అగ్నికి ఆహుతైన నీలగిరి చెట్లు

పుంగనూరు: ప్రమాదవశాత్తు జరిగిన అగ్నిప్రమాదంలో నీలగిరి తోట దగ్ధమైన సంఘటన మండలంలోని మేలుందొడ్డి గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. ఫైర్ ఆఫీసర్ సుబ్బరాజు కథనం మేరకు.. మేలుందొడ్డి గ్రామానికి చెందిన ఇందిరమ్మ, రామరాజుకు చెందిన నీలగిరి తోటల్లో మంటలు రావడంతో గమనించిన గ్రామస్తులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. ఫైర్ ఆఫీసర్ సుబ్బరాజు ఆధ్వర్యంలో సిబ్బంది హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ప్రమాదంలో రూ.20 వేల వరకు ఆస్తి నష్టం వాటిల్లినట్లు తెలిపారు. ప్రమాదానికి కారణాలు తెలియాల్సి ఉంది.

చర్చిలో ప్రత్యేక ఆరాధనలు


ప్రార్థనలు చేస్తున్న క్రిస్టియన్లు

పుంగనూరు: పట్టణంలోని కొత్తపేటలోని ఇమ్మానియల్ చర్చి, సీఎస్ఐ హట్టన్ మెమోరియల్ చర్చిలో ఆదివారం ప్రత్యేక ఆరాధనలు నిర్వహించారు. ఈసందర్భంగా పాస్టర్ జీవన్ బాబు బైబిల్ చదివి వినిపించారు. క్రీస్తు బోధనలు సర్వమానవాళి ఆచరించాలన్నారు.

ఉర్దూ జేఏసీ అధ్యక్ష, కార్యదర్శుల నియామకం


మహ్మద్‌అలీ, రహంతుల్లా

పలమనేరు: జిల్లా ఉర్దూ మీడియం పాఠశాలల జాయింట్ యాక్షన్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులుగా మహ్మద్ అలీ, రహంతుల్లా ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. స్థానిక ఉర్దూ పాఠశాలలో ఆదివారం ఈ ఎన్నికలు జరిగాయి. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నట్టు అష్టా మునాఫ్ తెలిపారు.

పుస్తక పఠనంతోనే జ్ఞానం



ప్రచారం నిర్వహిస్తున్న ప్రతినిధులు

కుప్పంరూరల్: పుస్తక పఠనంతోనే జ్ఞానం సిద్ధిస్తుందని ప్రబోధానంద సేవా సమితి కుప్పం ప్రతినిధి కృష్ణ అన్నారు. ఆదివారం మున్సిపాలిటీ పరిధిలోని అమరావతి కాలనీలో ప్రబోధానంద రచించిన పుస్తకాల గురించి ప్రజలకు వివరించారు. అదేవిధంగా ఉచితంగా భగవద్గీత పుస్తకాలను ప్రజలకు పంచిపెట్టారు. కార్యక్రమంలో ప్రకాష్, కృష్ణ, దేవరాజు, శరవణ, చందు, ఇందిర పాల్గొన్నారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

కుప్పంరూరల్: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు కడా కార్యాలయం తెలిపింది. కార్యక్రమానికి కడా డైరెక్టర్ వికాస్ మర్మత్ హాజరవుతారని, కుప్పం పరిధిలోని జనం ఏదైనా సమస్యలు ఉంటే అర్జీల రూపంలో ఆయన దృష్టికి తీసుకురావాలని కార్యాలయ వర్గాలు కోరాయి. అర్జీలకు తగినంత సమయంలో పరిష్కారం చూపనున్నట్లు పేర్కొన్నాయి.

కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన


కంటి పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ మురళి

బైరెడ్డిపల్లి: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం చెన్నై శంకర నేత్రాలయ, మిషన్ ఫర్ విజన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరంలో 50 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. 22 మందిని శస్త్రచికిత్సకు ఎంపిక చేశారు. ఆపరేషన్లు ఉచితంగా చేయడంతోపాటు ప్రయాణం, భోజన వసతులు ఏర్పాటు చేస్తామని నిర్వాహకులు తెలిపారు. వైద్యాధికారులు మురళి, క్రిష్ణ, నిర్వాహకులు శ్రీనివాసులు, రమణ, గంగాధరం, చంద్ర, చిన్నప్ప పాల్గొన్నారు.

నేడు డీవార్మింగ్ డే

పుంగనూరు: మండలంలోని అన్ని పాఠశాలల్లో సోమవారం డీవార్మింగ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ లీలామాధవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి పాఠశాలలోను డీవార్మింగ్ మాత్రలను పంపిణీ చేసి విద్యార్థులు ఆరోగ్యవంతులుగా ఉండేందుకు కృషి చేయాలని ఆమె పాఠశాలల హెచ్‌ఎంలను ఆదేశించారు. మండలంలోని 108 పాఠశాలల్లో 4,110 మంది విద్యార్థులకు, 81 అంగన్‌వాడీ కేంద్రాల్లో 1,911 మంది పిల్లలకు డీవార్మింగ్ మాత్రలు పంపిణీ చేసి, ఈ కార్యక్రమాన్ని తప్పక అమలు చేయాలని ఆమె ఆదేశించారు. తల్లిదండ్రులు తప్పకుండా పిల్లలను పాఠశాలలకు, అంగన్‌వాడీ కేంద్రాలకు పంపి డీవార్మింగ్ చేయించుకోవాలని కోరారు.

గురువు స్థానానికి ప్రత్యామ్నాయం లేదు


పూర్వ గురువులను సన్మానిస్తున్న నిర్వాహకులు

పలమనేరు: గురువు స్థానానికి మించిన ప్రత్యామ్నాయం లేదని పూర్వ ఆచార్యులు శంకరయ్య తెలిపారు. పట్టణంలోని కళామందిరంలో తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో ఆదివారం గురువందనం కార్యక్రమం జరిగింది. ఇందుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. నాడు గురువులకు ఉన్న స్వేచ్ఛ నేడు లేకుండా పోయిందన్నారు. నేటి సమాజంలో గురువులు వారి సమాజ హితం కోసం పాటుపడి ఆదర్శంగా నిలవాలని సూచించారు. ఈ సందర్భంగా నాలుగు దశాబ్దాల క్రితం గురువులుగా పనిచేసిన పలువురిని సమితి అధ్యక్ష, కార్యదర్శులు తులసీనాథంనాయుడు, పుష్ప ఘనంగా సన్మానించారు. రామచంద్ర, హరిప్రసాద్, రాజేంద్ర, మునిక్రిష్ణ, జ్యోతి, మల్లీశ్వరి, గాలిబాబు, బాలాజి, హరి, నరసింహారెడ్డి, ప్రభాకర్ పాల్గొన్నారు.

నేడు ఆల్బెండజోల్ పంపిణీ

చౌడేపల్లి: జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా సోమవారం 1 నుంచి 18 ఏళ్లలోపు విద్యార్థులు అందరికీ ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తున్నట్లు వైద్యాధికారి పవన్ కుమార్ తెలిపారు. మండలంలో 4,962 మందికి మాత్రలు తినిపించేలా ఏర్పాట్లు చేశామన్నారు.

రైతులకు డిజిటల్ గుర్తింపు కార్డులు

బైరెడ్డిపల్లి: రైతులకు త్వరలోనే డిజిటల్ గుర్తింపు కార్డులు పంపిణీ చేస్తామని, మండల పరిధిలోని రైతులు సహకరించాలని వ్యవసాయశాఖాధికారిణి గీతాకుమారి అన్నారు. బైరెడ్డిపల్లెలో ఆమె ఆదివారం విలేకర్లతో మాట్లాడారు. ప్రభుత్వం ద్వారా అందించే సంక్షేమ పథకాలు రైతులకు నేరుగా వచ్చేందుకు డిజిటల్ గుర్తింపు కార్డులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. రైతు సేవా కేంద్రాల్లోని వ్యవసాయ సహాయకులను సంప్రదించాలన్నారు. ఆధార్‌కార్డు, పాస్‌బుక్, ఆధార్ నంబర్‌కు లింక్ అయిన ఫోన్ నంబర్ తీసుకొచ్చి వ్యవసాయ సహాయకుల వద్ద ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఈనెల 28 వరకు గడువు ఉందని ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రైతులు నమోదు చేసుకోవాలి

సదుం: రైతు విశిష్ట సంఖ్య నమోదుకు రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలని ఏఓ మాధవి ఆదివారం తెలిపారు. వ్యవసాయరంగ ఆధునికీకరణలో భాగంగా కేంద్ర ప్రభుత్వం స్వంత భూమి గల రైతులకు ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య అందించనున్నట్లు ఆమె చెప్పారు. నమోదు చేసుకున్న వారికి మాత్రమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సంక్షేమ పథకాలు అందుతాయని చెప్పారు.

నేటి నుంచి దరఖాస్తులు

కుప్పంరూరల్: కుప్పం మండల పరిధిలోని రైతులు కేంద్ర ప్రభుత్వం ఇచ్చే రైతు విశిష్ట గుర్తింపు కార్డుకు నేటి నుంచి దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఫయాజ్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే ఈ కార్డు లేకుంటే రైతులకు సంబంధించిన సంక్షేమ పథకాలు ఏవీ రావని తెలిపారు. తప్పక ప్రతి ఒక్క రైతు ఈ విశిష్ట కార్డులను తీసుకోవాలని సూచించారు.

గుర్తింపు ఉంటేనే పథకాలు

గుడుపల్లె: రైతులు విశిష్ట గుర్తింపు సంఖ్యను చేసుకుంటేనే ప్రభుత్వ పథకాలు అందుతాయని వ్యవసాయశాఖ అధికారి నాగరాజు తెలిపారు. రైతులు మీ సమీపంలోని రైతు సేవా కేంద్రాల వద్దకు వెళ్లి ఆధార్‌కార్డుకు లింక్ అయిన ఫోన్ నంబర్, ఆధార్‌కార్డు, పట్టాదార్ పాసుపుస్తకం తీసుకుని వెళ్లి డిజిటల్ గుర్తింపును పొందాలన్నారు. గుర్తింపు పొందిన కార్డు నంబర్ జాగ్రత్తగా ఉంచుకోవాలన్నారు. డిజిటల్ గుర్తింపు చేసుకున్న రైతులకు మాత్రమే ప్రభుత్వం అందించే అన్ని పథకాలు అందుతాయన్నారు.

భయాన్ని వీడి పరీక్షలు రాయాలి


మాట్లాడుతున్న గిరిధర్

పలమనేరు: పబ్లిక్ పరీక్షలంటే భయాన్ని ముందుగా వీడి స్వేచ్ఛగా పరీక్షలు రాయాలని జేవీవీ అధ్యక్షుడు గిరిధర్ సూచించారు. స్థానిక ఏఎస్‌డబ్ల్యూఓ హైమావతి ఆధ్వర్యంలో సంక్షేమ వసతి గృహ పదో తరగతి విద్యార్థులకు ప్రేరణ కార్యక్రమం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆదివారం జరిగింది. ఆయన మాట్లాడుతూ పరీక్షలంటే విద్యార్థులు పడే భయంతోనే నేర్చుకున్న విషయాలను మరిచి పోతున్నారన్నారు. భయాన్ని పక్కన పెట్టి మనం గురువుల ద్వారా నేర్చుకున్న పాఠాలను మీకు తెలిసినట్టు రాస్తే సరిపోతుందన్నారు. దీని కోసం మరిన్ని సులభ పద్ధతులను గణిత, సైన్సు నిపుణులు విజయకుమార్, చంద్రశేఖర్ రెడ్డి వివరించారు పలమనేరు, బంగారుపాళెం యాదమరి, పెద్దపంజాణి హాస్టల్ వార్డెన్లు, టెన్త్ విద్యార్థులు పాల్గొన్నారు.

బంజారాల సంఘ సలహాదారు నియామకం


డాక్టర్ బాణావత్ మునీంద్రనాయక్

పుంగనూరు: ఆల్‌ఇండియా బంజారా సేవా సంఘం ఉమ్మడి జిల్లాల ప్రధాన సలహాదారుగా డాక్టర్ బాణావత్ మునీంద్రనాయక్ నియమించినట్లు ఎన్నుకున్నారు. ఆదివారం గుంటూరులో రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక సుగాలిమిట్టకు చెందిన డాక్టర్ మునీంద్రనాయక్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మునీంద్రనాయక్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న బంజారా సంఘ సభ్యుల సమస్యలను పరిష్కరించి, ఆకుటుంబాలను అన్నివిధాల ఆదుకునేందుకు కృషిచేస్తామని ఆయన తెలిపారు.

ముగ్గురు డాక్టర్లకు మెమోలు

సాక్షి ఎఫెక్ట్..

చౌడేపల్లి: ప్రభుత్వాస్పత్రికి వైద్యసేవల కోసం వచ్చిన చిన్నకొండామర్రికి చెందిన షవ్యశ్రీ పట్ల దురుసుగా ప్రవర్తించిన ముగ్గురు డాక్టర్లకు చిత్తూరు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిణి సుధారాణి ఆదివారం మెమోలు జారీచేశారు. శనివారం సాక్షిలో ప్రచురితమైన 'రోగిపై దురుసు ప్రవర్తన' కథనంపై ఆమె తీవ్రంగా స్పందించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోపాటు నెలసరి సమస్యతో ఇబ్బంది పడుతున్న రోగి, వైద్యసేవల కోసం డాక్టర్ పూజకు వివరిస్తుండగా అదే గదిలో డాక్టర్ నవీన్‌తేజ్ ఉండడం, విధులు నిర్వహించకుండా సెల్‌ఫోన్‌లో యూట్యూబ్ చూస్తుండగా సౌండ్ ఎక్కువగా ఉందని డాక్టర్ చెప్పేది వినపడడంలేదని రోగి అనడంతో ఆమె పట్ల హేళనగా వ్యవహరించడంపై డీఎంహెచ్‌ఓ డాక్టర్ల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. డాక్టర్ పూజ, డాక్టర్ నవీన్‌తేజ్, డాక్టర్ పవన్‌కుమార్‌లకు మెమోలు జారీ చేశారు. సోమవారం జిల్లా వైద్య ఆరోగ్యకేంద్రానికి హాజరై సంజాయిషీ ఇవ్వాల్సిందిగా కోరుతూ మెమోలో పేర్కొన్నారు.


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

నివాళి

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని గడ్డంవారిపల్లె పంచాయతీ పాపిరెడ్డిగారిపల్లెకు చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నేత ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి సమీప బంధువైన టి.రెడ్డీశ్వరరెడ్డి తల్లి టి.జయమ్మ (80) అనారోగ్యంతో శనివారం మృతి చెందింది. ఆదివారం పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, తంబళపల్లె ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి ఆమె మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో మాజీ ఎంపీ రెడ్డెప్ప, మాజీ ఎంఎల్‌సీ యండపల్లె శ్రీనివాసులురెడ్డి, సైకం జయచంద్రారెడ్డి, ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి, విరూపాక్షి జయచంద్రారెడ్డి, వల్లివేడు రాజారెడ్డి, హేమచంద్రారెడ్డి, విజయభాస్కర రెడ్డి, చంద్రశేఖరరెడ్డి, గోవిందరెడ్డి, చెంచురెడ్డి పాల్గొన్నారు.

ఆదిశేషునిపై వేణుగోపాలుని చిద్విలాసం


శేషవాహనంపై విహరిస్తున్న స్వామిఅమ్మవార్లు

వి.కోట: పట్టణంలోని వేణుగోపాలస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆదివారం శేషవాహనంపై పట్టణ పురవీధుల్లో విహరించారు. ఈ సందర్భంగా ఉదయం ఆలయంలో స్వామివారికి అర్చకులు ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఉభయదారుల ఆధ్వర్యంలో ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి పల్లకీలో కొలువుదీర్చి పట్టణ పురవీధుల్లో ఊరేగించారు. రాత్రి ఆర్యవైశ్య సంఘం వారి ఆధ్వర్యంలో శేష వాహనంపై స్వామి వారిని కూర్చోబెట్టి కోలాటాలు, పండరి భజనలు, మంగళ వాయిద్యాలు బాణసంచాల నడుమ అంగరంగ వైభవంగా పట్టణ పురవీధుల్లో ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. స్వామి వారిని దర్శించుకుని భక్తులు స్వామి కృపకు పాత్రులయ్యారు.

మాఘ మాస పండుగలపై ప్రచారం


భగవద్గీత ప్రచారంలో సభ్యులు

గంగవరం: ఇంటింటా హిందూ ధర్మ ప్రచారంలో భాగంగా మండలంలోని ఉయ్యాలమిట్ట గ్రామంలో మాఘ మాసంలో పండుగల ప్రత్యేకతపై భగవద్గీత ప్రచార కార్యక్రమాన్ని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి సభ్యులు ఆదివారం నిర్వహించారు. ఆదికర్త గురువు ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రాసిన త్రైత సిద్ధాంత భగవద్గీత, అనుబంధ ఆధ్యాత్మిక గ్రంథాలను ప్రచారం చేశారు. కమిటీ అధ్యక్షుడు, సభ్యులు భాస్కర్, బాలాజి, రాజేంద్ర, ఉదయ్, రెడ్డెమ్మ, రేఖ, జ్యోతి పాల్గొన్నారు.

ఇడుపులపాయలో వైఎస్సార్‌కు నివాళి


వైఎస్సార్ సమాధి వద్ద నివాళులర్పిస్తున్న నేతలు

గుడుపల్లె: మండలంలోని సంగనపల్లెకు చెందిన వైఎస్సార్ యూత్ నేతలు ఆదివారం ఇడుపులపాయలోని దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి సమాధి వద్ద నివాళులర్పించారు. వైఎస్సార్ చేసిన సేవలను స్మరించుకుని సంగనపల్లె గ్రామంలోని 20 మంది యూత్ నేతలు ఇడుపులపాయకు వెళ్లి నివాళులర్పించారు. యూత్ నేతలు సుబ్బారాజు, మురళి, గవాస్కర్‌రాజు, కిరణ్ పాల్గొన్నారు.

వైభవంగా వార్షికోత్సవ పూజలు



విశేష అలంకరణలో వాసవీ మాత, పూజల్లో భక్తులు

బైరెడ్డిపల్లి: స్థానిక శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆదివారం 19వ వార్షికోత్సవ పూజలను వైభవంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం భక్తిశ్రద్ధలతో హోమం నిర్వహించి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. వాసవీ ఫౌండేషన్, కుసుమపుత్రి వింగ్స్ నిర్వాహకులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

చెరువులో చెత్త

- డంపింగ్ కేంద్రాలకు చేరని చెత్త
- నీరుగారుతున్న ఆశయం


రొంపిచెర్ల గ్రామ పంచాయతీలోని చెన్నాయుని చెరువులో వేసిన చెత్త

రొంపిచెర్ల: గ్రామాల్లో పంచాయతీ కార్మికులు సేకరించిన చెత్త రొంపిచెర్ల గ్రామ పంచాయతీలోని చెరువులకు చేరుతోంది. దీని కారణంగా డంపింగ్ కేంద్రాల లక్ష్యం నీరుగారుతోంది. రొంపిచెర్ల గ్రామ పంచాయతీలోని గ్రామాల్లో చెత్తను పంచాయతీ కార్మికులు నిత్యం శుభ్రం చేసి చెత్తను సమీపంలోని చెన్నాయునిచెరువులో వేస్తున్నారు. అక్కడ చెత్త కంపు కొడుతోంది. అయితే గ్రామాల్లో సేకరించిన చెత్తను డంపింగ్ యార్డ్‌లో వేసి తడి చెత్త, పొడి చెత్తను వేరు చేసి ఎరువును తయారు చేసి తక్కువ ధరతో రైతులకు విక్రయించి గ్రామ పంచాయతీలను అభివృద్ధి చేయాలని ప్రభుత్వ ఆశయం ఇక్కడ నీరుగారిపోతోంది. రొంపిచెర్ల గ్రామ పంచాయతీలో లక్షలు ఖర్చు చేసి నిర్మించిన డంపింగ్ యార్డ్ నిరుపయోగంగా ఉంది. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు తగిన చర్యలు తీసుకుని చెత్తను డంపింగ్ యార్డ్‌కు తరలించి ఎరువు తయారు చేసి పంచాయతీ అభివృద్ధికి కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

మరుగుదొడ్లు వినియోగంలోకి తెండి సారూ!

- భక్తుల అవస్థలు
- లక్షలాది నిధులు వృథా


బోయకొండలో నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లు

చౌడేపల్లి: బోయకొండ గంగమ్మ ఆలయానికి యాత్రికులు వివిధ ప్రాంతాల నుంచి నిత్యం అధిక సంఖ్యలో వస్తుంటారు. గతంలో భక్తుల సౌకర్యార్థం బోయకొండ గంగాపురంలోని గోశాల పక్కన లక్షలాది రూపాయల నిధులతో మరుగుదొడ్లు ఏర్పాటుచేశారు. వీటిని వినియోగించుకోనీకుండా తాళాలు వేయడంతో నిరుపయోగంగా మారాయి. గంగాపురంతోపాటు పార్క్ వద్దకు వచ్చిన యాత్రికులకు మరుగుదొడ్ల సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి మరుగుదొడ్లను వినియోగంలోకి తేవాలని భక్తులు కోరుతున్నారు.

కొనసాగుతున్న రైతు దీక్షలు


దీక్షలో కూర్చున్న రైతులు

కుప్పంరూరల్: కుప్పం మండలం, ఆవులనత్తం వద్ద జెల్లి ఫ్యాక్టరీ నిర్వహణ వల్ల తమకు తీరని నష్టం కలుగుతోందని స్థానిక రైతులు నిరసనలు చేపడుతున్న విషయం విదితమే. నెల రోజులకు పైగా రైతులు రోజూ దీక్షలు చేపడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు, స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, నాయకులకు ప్రజా ఆరోగ్యం, సమస్యలు పట్టడం లేదని అంటున్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి అయినా స్పందించి రైతులకు న్యాయం చేయాలని స్థానికులు కోరుతున్నారు.